RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 313 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం గురువారం, 16 మే 2024 పేజీలు : 4 వెల : 2/-

# రైతు సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్

## రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్: రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం తెలంగాణ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులతో చర్చలు జరిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15వ తేదీలోగా రైతు రుణమాఫీ చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయం తీసుకున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వ్యయాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసేలోపు రుణమాఫీకి అవసరమైన నిధులను సమీకరించేందుకు ఉన్న వివిధ మార్గాలను అధికారులతో చర్చించారు. రూ. 2 లక్షల రుణమాఫీకి సంబంధించి విధి విధానాలతో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

అవసరమైతే రైతుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణమాఫీకి సరిపడే నిధులను సర్దుబాటు చేయాలని ఆదేశించారు. రైతులను రుణ విముక్తులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని నిర్ణీత గడువులోగా నిధులను సమీకరించే ప్రయత్నాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భారీ మొత్తంలో నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చే బ్యాంకర్లతో సంప్రదింపులు జరపాలని సూచించారు. రైతు రుణమాఫీ కి సంబంధించి మహారాష్ట్ర, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విధానాలను అధ్యయనం చేయాలని అధికారులను సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, దళారుల జోక్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి పంటను కొని మిల్లింగ్ చేసి రేషన్ షాపుల్లో సన్న బియ్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. కల్లాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పారు. తడిసిన ధాన్యం, తేమ విషయంలో రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అన్నారు. అక్రమాలకు పాల్పడే రైస్ మిల్లర్లపై ఉక్కు పాదం మోపాలని, కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు.



## వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి మోసం

### రాష్ట్రవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చిన కేసీఆర్

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సీఎం ప్రస్తుతం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడం, మోసం చేయడమేనని.. దగా చేయడమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను గులాబీ బాస్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ““రాష్ట్రంలో 90శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది?’ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వచించింది. ఓట్లు డబ్బాలో పడంగనే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరింది. అందుకే నాలిక మల్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నారు. ఇదే సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు గనుక చెప్పింటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కుతుక్కు చేసేవాళ్లు. ఇప్పటికీ ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారు. రైతుబంధు ఇయ్యక, రైతు భరోసా ఇయ్యకుండా రైతాంగాన్ని అన్నిరకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నది. అందు కారణంగానే రైతాంగ హక్కులను హామీలను సాధించేందుకే బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టింది’ కేసీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతులపక్షాన నిలబడి కొట్లాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కొనడానికి నిర్లక్ష్యం వహిస్తూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడిపిస్తూ గోస పుచ్చుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతాంగానికి భరోసా కల్పించే దిశగా నిరసన కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ వడ్ల కల్లాలకాడికి బీఆర్ఎస్ శ్రేణులు వెళ్లాలని.. రైతులకు అండగా నిలవాలని బీఆర్ఎస్ అధినేత పిలుపునిచ్చారు. రైతుల హక్కులను కాపాడేందుకు వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అధినేత కేసీఆర్ పునరుద్ఘటించారు.




ఢిల్లీ: జూన్ 4వ తేదీన పేద రైతుల రుణాలను మాఫీ చేయబోతున్నామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఇవాళ ఉత్తర ప్రదేశ్ లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని చెప్పారు. ‘మేం అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేసి తీరుతామని, అదాని, మోదీ మీడియా ఏం రాసుకుంటారో రాసుకోండి.. ఎవరికీ భయపడేది లేదు..ఈ మీడియా మోదీ ఫొటోలు మాత్రమే వేస్తుంది.. ఏమైనా వేసుకోండి మేం చేయాలనుకున్నది చేస్తాం’అని వ్యాఖ్యానించారు. పేద మహిళల ఖాతాల్లో నెలకు రూ. 8,500 చొప్పున ఏడాదికి రూ. లక్ష వేయబోతున్నామని, ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళ ఖాతాల్లో మహాలక్ష్మి పథకం కింద ఈ డబ్బులు వేస్తామని చెప్పారు.

## తెలంగాణలో వర్సిటీల ఉపకులపతుల నియామకానికి ఈసీ అనుమతి

హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 10 విశ్వవిద్యాలయాలకు కొత్త ఉపకులపతు(వీసీ)ల నియామకానికి ఎన్నికల కమిషన్ అనుమతిచ్చింది. దీంతో షెడ్యూల్ ప్రకారమే వీసీల నియామకం జరుగుతుందని విద్యాశాఖ కార్యదర్శి తెలిపారు. త్వరలో సెర్చ్ కమిటీల సమావేశం జరుగుతుందన్నారు. వీసీల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఉపకులపతుల మూడేళ్ల పదవీకాలం మే నెలాఖరుతో ముగుస్తుంది. ఈ క్రమంలో అర్హులైన ఆచార్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం నోటిఫికేషన్ విడుదల చేశారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా పూర్తయింది. జేఎన్‌టీయూహెచ్, ఓయూ, కాకతీయ, తెలంగాణ, శాతవాహన, పాలమూరు, మహాత్మా గాంధీ, తెలుగు, ఆర్కిటెక్చర్ (జేఎన్‌ఏఎఫ్ఏయూ), అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాలకు కొత్త వీసీలను నియమించనున్నారు.



# హమ్మయ్య టైం దొరికింది

## దేశవిదేశాలకు చెక్కేస్తున్న పొలిటికల్ లీడర్లు

హైదరాబాద్ / అమరావతి : తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సమరం ముగిసింది. ఇన్నాళ్లు మండటెండలో కూడా ప్రజల మధ్య తిరిగి ఓట్లు రాబట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఊపిరి సలపనంత బిజీబిజీగా గడిపిన నాయకులు పోలింగ్ ముగియడంతో హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

పోలింగ్ ముగియగా.. ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్నాయి. అంటే దాదాపు 20 రోజుల సమయం ఉంది. చాలా రోజుల సమయం ఉండడంతో నాయకులంతా తమ వ్యక్తిగత పనులు చేసుకోవడానికి సిద్ధమయ్యారు. ఎన్నికల హడావుడిలో పడి కుటుంబానికి దూరంగా ఉన్న నాయకులు ఈ గ్యాప్‌లో వ్యక్తిగత జీవితానికి పూర్తి సమయం కేటాయిస్తున్నారు. ఎంచక్కా దేశవిదేశాల్లో పర్యటించేందుకు ప్రణాళికలు వేసుకున్నారు. కొందరు నాయకులైతే ఇప్పటికే టూర్లకు వెళ్లారు. ఎన్నికల ఫలితాలకు రెండు మూడు రోజుల ముందు మళ్లీ స్వస్థలాలకు చేరుకునే అవకాశం ఉంది. ఫలితాలు వచ్చేలోపు కాస్త సేదతీరేందుకు వెళ్తున్నారు. ఇప్పటికే తెలంగాణలో ఇప్పటికే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి కేరళ పర్యటనకు వెళ్లారు. అనూహ్యంగా ఎమ్మెల్యేలతో ఆయన ట్రిప్ వేయడం రాజకీయ వర్గాల్లో కలకలం ఏర్పడింది. అయితే రాజకీయ పర్యటననా? లేదా వ్యక్తిగత పర్యటన అనేది తేలాల్సి ఉంది. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా వ్యక్తిగత పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు విదేశాలకు వెళ్లేందుకు వెళ్తున్నారు. మరికొందరు దేశంలోని పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు సందర్శించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కనీసం రెండు, మూడు వారాల పాటు తమను ఎవరూ సంప్రదించవచ్చని తమ అనుచరులు, అభిమానులకు సూచనలు చేసి మరి వెళ్తున్నారు. కొన్ని రోజుల పాటు తమను కలవడానికి కూడా ఎవరూ రావొద్దని ఆదేశిస్తున్నారు.

**సీఎం జగన్ విదేశీ పర్యటన :** ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు కూడా సేద తీరుతున్నారు. దేశ విదేశాలకు వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబంతో సహా విదేశాలకు వెళ్తున్నారు. ఆయన విదేశీ పర్యటనకు నాంపల్లి సీబీఐ కోర్టు అనుమతినిచ్చింది. యూకే, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ దేశాలకు వెళ్లనున్నారు. అన్ని పార్టీల నాయకులు వ్యక్తిగత పర్యటనలు చేస్తున్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీ అధినేతలతోపాటు సామాన్య కార్యకర్తలు కూడా వ్యక్తిగత పనుల్లో బిజీ అయ్యారు.

**అంతటా ప్రశాంతత :** నాయకులు, కార్యకర్తల పట్టణాలతో హోరెత్తిన గ్రామాలు, పట్టణాల్లో కూడా ప్రశాంత వాతావరణం ఏర్పడింది.

నాయకుల ప్రసంగాలు, పాటలతో నిత్యం రోత ఉండగా ఇప్పుడు ప్రశాంతత నెలకొంది. ప్రచార హడావుడి, మైకుల హోరు, రోడ్‌షోలు, ర్యాలీలు, సభలు, సమావేశాలతో హోరెత్తిన పల్లె, పట్టణాల్లో కొంత నిశ్శబ్ద వాతావరణం ఏర్పడింది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మోడీ బలప్రదర్శన దేని కోసం ?

ఆయన ప్రపంచంలోనే అగ్ర శ్రేణి నేతగా ఉన్నారు. ఆ విధంగా బీజేపీ ప్రచారం చేసుకుంటూ వస్తోంది కూడా. దేశంలో మోడీకి సరిసాటి నేతలు ఎవరూ లేరని కూడా చెబుతూ వస్తుంది. ఒక్క మోడీ చాలు అని బీజేపీ చాలా గొప్పగా మాట్లాడుతుంది. అటువంటి మోడీ చుట్టూ మిగిలిన నాయకులు ఉండాలా. అది అవసరమా అన్న చర్చ వస్తోంది. మోడీ వారణాసిలో తన నామినేషన్ పత్రాలను మంగళవారం దాఖలు చేశారు. ఈ కార్యక్రమం చాలా ఆర్భాటంగా సాగింది. ఎన్డీయే మిత్ర పక్షాల నేతలను అందరినీ పిలిచి మరీ ఘనంగా నిర్వహించారు. మోడీకి మిత్ర పక్షాల నేతలు అంతా అభినందనలు శుభాకాంక్షలు తెలిపే కార్యక్రమం కూడా ఒకటి జరిగింది. అసలు ఇదంతా ఇపుడు ఎందుకు అన్నదే అందరిలోనూ కలుగుతున్న సందేహం. ఆరేడు నెలల క్రితం ఢిల్లీలో జరిగిన ఎన్డీయే సమావేశం నాటికి టీడీపీ అందులో లేదు. జనసేనకే ఆహ్వానం దక్కింది. అలా పవన్ వెళ్ళి వచ్చారు. మార్చి నెలలో టీడీపీ రీ ఎంట్రీ ఇచ్చింది. ఇపుడు వారణాసిలో జరిగిన ఎన్డీయే మీట్ కి బాబుకు ఇన్విటేషన్ పంపించారు. చంద్రబాబు వెళ్ళి మోడీని అభినందించడమే కాకుండా మూడవసారి దేశానికి ప్రధాని అవుతారు అని కూడా జోస్యం చెప్పారు. ఎన్డీయే మిత్ర పార్టీలను చూస్తే ఒక్క టీడీపీ తప్ప మిగిలినవి అన్నీ కూడా చిన్న పార్టీలుగానే ఉన్నాయి. చాలా పార్టీలు సింగిల్ డిజిట్ సీట్లకే పరిమితం అయి పోటీ చేస్తున్నాయి. టీడీపీ తరువాత నితీష్ కుమార్ పార్టీ మరో పెద్ద పార్టీ. ఇక మహారాష్ట్రలో ఉన్న శివసేన ఎన్సీపీ చీలిక పార్టీల బలాలు ఈ ఎన్నికల్లో తేలాల్సి ఉంది. బీజేపీకి కూడా మిత్రుల బలం తెలుసో ఏమో కానీ బీజేపీకి సొంతంగా 370 సీట్లు ఎన్డీయేకు 400 సీట్లు అని టార్గెట్ పెట్టుకుంది. అంటే మిత్రులకు కేవలం ముప్పయి సీట్లు మాత్రమే వస్తాయని లెక్క వేసుకుందా అన్నది ఇక్కడ చర్చగా ఉంది. ఇండియా కూటమిలో డబుల్ డిజిట్ నంబర్ ఎంపీలు కలిగిన పార్టీలు బోలెడు ఉన్నాయి. అంతే కాదు రాష్ట్రాలను ఏలే పార్టీలు కూడా ఉన్నాయి. కానీ ఎన్డీయేలో టీడీపీ తప్ప ఆ స్థాయి పార్టీలు పెద్దగా లేవు అనే అంటున్నారు. అయినా సగానికి పైగా పోలింగ్ జరిగిన తరువాత ఎన్డీయే మిత్రులతో మీట్ ఎందుకు అన్నది కనుక ఆలోచిస్తే మోడీ కోసం ఈ బల ప్రదర్శన జరిగింది అని అంటున్నారు.

ఉత్తరాదిన బీజేపీ ప్రతిష్ట బాగా తగ్గిందని సర్వేలు కూడా చెబుతున్నాయి. ఇక విశ్లేషకుల మాట అయితే బీజేపీ ఈసారి చాలా ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొంటుందని.

# రైతుల చెంతకు రాజన్న కోడెలు



వేములవాడ: దక్షిణకాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామికి భక్తులు సమర్పించే కోడెలను అర్హులైన రైతులకు ఉచితంగా అందించేందుకు ఆలయ అధికారులు కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయమై ఆలయ అధికారులు దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఇందుకు సంబంధించిన నియమ నిబంధనలను ఆలయ అధికారులు రూపకల్పన చేస్తున్నారు.

రాజన్న ఆలయం కోడె మొక్కులకు ప్రసిద్ధి. స్వామివారిని దర్శించుకున్న భక్తుల్లో ఎక్కువ మంది కోడె మొక్కులు చెలించుకుంటారు. కొందరు ఇంటి వద్ద పెంచినవి, ఇతరుల వద్ద కొనుగోలు చేసిన కోడెలను స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. వీటిని ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో సిబ్బంది సంరక్షిస్తుంటారు. ప్రస్తుతం గోశాలలో వేయికి పైగా కోడెలు, ఆవులున్నాయి. జనవరికి ముందు ఈ గోశాల నుంచి రాష్ట్రంలోని వివిధ గోశాలలకు కోడెలను రాష్ట్ర గోశాల ఫెడరేషన్ ద్వారా అందజేసేవారు. ఈ గోశాల నుంచి ఇతర గోశాలలకు పంపిణీ చేస్తున్న కోడెలు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వచ్చాయి. జనవరిలో మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలో దుబ్బతండా గోశాలకు వ్యాన్‌లో తరలిస్తున్న 20 కోడెలకు బదులు 24 కోడెలు ఉండటంతో అవి పక్కదారి పడుతున్నాయనేది స్పష్టమైంది. అప్పటి నుంచి రాజన్న కోడెలను అర్హులైన రైతులకు అందించాలనే డిమాండ్ ప్రజల నుంచి వచ్చింది. మరోవైపు రాజన్న గోశాల నుంచి ఇతర గోశాలలకు కోడెలను అందజేసే కార్యక్రమాన్ని ఆలయ అధికారులు నిలిపివేశారు. దీంతో గోశాలలో కోడెల సంఖ్య భారీగా పెరిగిపోయింది. దీంతో మేత, వసతి, వైద్యం వంటివి పూర్తి స్థాయిలో అందక చాలా వరకు బక్కచిక్కిపోయాయి. కొన్ని అనారోగ్యంతో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతురావు గోశాలలను పరిశీలించి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను ఆదేశించడంతో ప్రత్యేక చర్యలకు అధికారులు ఉపక్రమించారు.

అధికారులతో కమిటీ ఏర్పాటు

భక్తులు రాజన్నకు సమర్పించిన కోడెలను అర్హులైన రైతులు, ఇతర గోశాలలకు పంపిణీ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో రెవెన్యూ, పోలీస్, పశు సంవర్ధకశాఖ, ఆలయ అధికారితో ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారికి పంపిణీ చేసేందుకు ఈ కమిటీ రైతుకు సంబంధించిన పూర్తి వివరాలను క్షేత్ర స్థాయిలో సేకరించనుంది. తరవాత అర్హులైన వారిని గుర్తించి ఎంపిక చేసిన రైతుల ఆధార్ కార్డు, సంతకాలు సేకరించిన తరవాత కోడెలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు విక్రయించకుండా ఒప్పందం పూర్తి చేసిన తరవాత అందజేయనున్నారు. పంపిణీ చేసే ప్రతి కోడెకు ట్యాగ్ తప్పనిసరిగా అమర్చి రైతులకు పంపిణీ చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రైతులు తీసుకెళ్లిన తరవాత వాటి పర్యవేక్షణపై నిఘా పెట్టనున్నారు. దీంతో పాటు తక్కువ మొత్తంలో నిబంధనలకు లోబడి ఉన్న ఇతర గోశాలలకు అగ్రిమెంట్ ప్రకారం కోడెలను అందజేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. త్వరలోనే ఈ కార్యక్రమం కార్యరూపం దాల్చనుందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

ఆదేశాలు రాగానే... – కృష్ణ ప్రసాద్, రాజన్న ఆలయం, వేములవాడ

దేవాదాయశాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు రాగానే అర్హులైన రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రైతులకు ఉచితంగా కోడెలు పంపిణీకి సంబంధిత కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించాం. పూర్తి స్థాయిలో గైడ్‌లెన్స్ రాగానే పంపిణీ కార్యక్రమం జరుగుతుంది.

# నీరు రాదు.. నిర్వహణ లేదు




హైదరాబాద్ : ప్రజా మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. నీరు లేదంటూ గుత్తేదారులు నిర్వహణను వదిలేశారు. అధికారులు నెలవారీ మామూళ్లు తీసుకుని.. నిర్వహణ బిల్లులపై సంతకాలు చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకుల కోసం మూడేళ్ల కిందట నగరవ్యాప్తంగా దాదాపు 6 వేల మరుగుదొడ్లు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం చాలావరకు గల్లంతయ్యాయి. ఇటీవల 2,173 ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. ఇవి కూడా శుభ్రంగా లేవు.

ఇదీ పరిస్థితి.. నీరు లేకపోవడంతో ఎర్రగడ్డ ఆయుర్వేద ఆసుపత్రి ఎదురుగా కాలిబాటపై ఉన్న మరుగుదొడ్డి చాలా రోజులుగా మలవ్యర్థాలతో నిండి ఉంది. వెంగళరావునగర్ కల్యాణ్ నగర్ చౌరస్తా వద్ద నున్న మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది.

దిల్‌సుఖ్‌నగర్ బస్టాండు పరిసరాల్లో ఒక్కటీ పని చేయట్లేదు. సాయిబాబా గుడి నుంచి దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తా వెళ్లే రోడ్డులో నాలుగేళ్ల క్రితం ఈ–టాయిలెట్ ఏర్పాటు చేయగా, ప్రారంభించిన నెల రోజులకే మూతపడింది. వాటి పక్కనున్న ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్ల పరిస్థితి అంతే.

వీఎస్టీ కూడలి నుంచి రాంనగర్ వెళ్లే రోడ్డులోని ప్రీ ఫ్యాబ్రికేటెడ్ మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదు.

పాతబస్తీ మొఘల్‌పుర క్రీడా ప్రాంగణంలో సుమారు పది ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లు మూలకుబడ్డాయి.

ఐఎస్ సదన్ డివిజన్ సైదాబాద్ బిస్కట్ ఫ్యాక్టరీ దోబీఘాట్ వద్దనున్న మరుగుదొడ్లకు తలుపులు, విద్యుత్తు, నీటి కనెక్షన్లు లేవు.

పేరుకే నిబంధనలు.. ఒక్కో మరుగుదొడ్డి నిర్వహణకు బల్దియా రూ.4 వేలు చెల్లిస్తోంది. మరుగుదొడ్లలో గుత్తేదారు లిక్విడ్ సోప్, నీటి వసతి కల్పించాలి. 500 లీటర్ల నీటి ట్యాంకును రోజూ నింపాలి. భూగర్భంలోని ట్యాంకులోని మల వ్యర్థాలను ఏరోజుకారోజు మురుగు శుద్ధి కేంద్రాలకు తరలించాలి.


ప్రతి నిర్మాణాన్ని 4 గంటలకోసారి శుభ్రం చేయాలి. 15 టాయిలెట్లను ఓ క్లస్టర్‌గా విభజించి.ప్రైవేటు నిర్వహణకు అప్పగించారు. సెలవు రోజుల్లోనూ శుభ్రం చేయాలి. చుట్టూ 50 మీటర్ల పాటు వ్యర్థాలు, బహిరంగ మూత్ర విసర్జన జరగకుండా చూడాలి. బ్లీచింగ్ పౌడరు, సున్నం చల్లాలి.శుభ్రం చేయకపోతే రోజుకు రూ.1,000 జరిమానా, ఫినాయిల్, యాసిడ్ వాడకపోయినా, క్రిమి సంహారక రసాయనాలు వినియోగించకున్నా..రూ.100 చొప్పున జరిమానా ఉంటుంది. ఎవరి నుంచైనా ఫిర్యాదు అందితే గుత్తేదారు రూ.300 జరిమానా చెల్లించాల్సిందే.

# అడవుల్లో జలవనరుల సృష్టి

నిజామాబాద్ : ఎండలు మండుతున్నాయి. అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులకు నీటి కొరత ఏర్పడకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నీటి కుంటలు, సాసర్‌పిట్స్‌ల్లో నీరు నింపడంతోపాటు నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో ఇంకి పోకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కారణంగా జంతువులు జనావాసాల్లోకి రావడం లేదు.

86 వేల హెక్టార్ల విస్తీర్ణం

జిల్లాలో నిజామాబాద్, ఆర్మూర్ రెండు అటవీ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 86 వేల హెక్టార్ల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు నిజామాబాద్ డివిజన్‌లో 175, ఆర్మూర్‌లో 100 సాసర్‌పిట్స్ నిర్మించారు. సోలార్‌తో పని చేస్తున్న బోర్‌వెల్స్ ఇందల్‌వాయిలో 6, నిజామాబాద్ సౌత్‌లో 01, వర్నిలో 02, ఆర్మూర్‌లో 02, కమ్మర్‌పల్లిలో 03 ఏర్పాటు చేశారు. ఇవి ఆటోమెటిక్ పద్ధతిలో పని చేస్తాయి. వీటి ద్వారా నీటి కుంటల్లో పుష్కలంగా జలాన్ని నింపుతున్నారు. వీటిని జంతువుల సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అమర్చారు. వర్ని, భీమ్‌గల్, సిరికొండ ప్రాంతాల్లో నీటి కొరత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ అడవితో పాటు జంతువుల సంచారం ఎక్కువే. ఈ ప్రాంతాల్లో అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.



నిధుల లేమి..ఏటా మార్చి నుంచి మే వరకు సిబ్బంది నిత్యం అటవీ ప్రాంతంలో పర్యవేక్షిస్తూ ఒక్కో సాసర్‌పిట్‌లో నెలకు మూడు సార్లు, సిమెంట్‌తో ఏర్పాటు చేసిన తొట్టిల్లో నెలకు నాలుగు సార్లు నీరు నింపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు నెలకు రూ.3850 వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. కానీ మూడేళ్లుగా అవి రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది సొంత డబ్బుతో నీరు నింపుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారిస్తే వన్యప్రాణులకు మరింత మేలు కలుగుతుంది.

# నేతన్నల భూములపై అక్రమార్కుల కన్ను

వరంగల్ : నేతన్నలు చెమటోడ్చి మగ్గంపై శ్రమిస్తేగానీ పూట గడవదు. అలా వారు రూపాయి రూపాయి పోగు చేసి కూడబెట్టుకుని కొనుక్కున్న స్థలాలను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. జనగామ పట్టణ పరిధిలో చేనేత సొసైటీ ఏర్పాటుచేసుకొని పట్టాలు చేసుకున్న జాగలపై కొందరు పెద్దల కన్ను పడింది. రూ.కోట్ల విలువైన ఈ భూములను సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. నిబంధనలు అతిక్రమించి పట్టాలు చేసుకుంటూ నేతన్నల పొట్టలు కొడుతున్నారు. పట్టణం సమీపంలో ఉన్న 'ది భారత్ టెరీకాటన్ అండ్ జరీబార్డర్ చేనేత సహకార, అమ్మకం సొసైటీ' భూములు అన్యాక్రాంతమవుతున్న తీరుపై ప్రత్యేక కథనం.

జనగామ, పరిసర 30 గ్రామాల నిరుపేద చేనేత కార్మికులు నివేశన స్థలాల కోసం స్థానిక 'ది భారత్ టెరీకాటన్ అండ్ జరీబార్డర్ చేనేత సహకార, అమ్మకం సొసైటీ' ఆధ్వర్యంలో జనగామ పట్టణ పరిధిలోని సర్వే నెంబర్ 314లో 12 ఎకరాల భూమి కొనుగోలుకు రైతుల నుంచి ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత అదే సర్వేనెంబరులో 9.14 ఎకరాల భూమిని ఖరీదు చేసి 1989 జూన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. చట్టపరమైన రక్షణ కోసం ఆ భూమిని సొసైటీ ద్వారా ప్రభుత్వానికి అప్పగించారు. 120 గజాల చొప్పున 248 ప్లాట్లను మండల రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో అప్పట్లో లేఔట్ కూడా చేశారు. 252 మందికి అప్పటి తహసీల్దార్ 1994లో పట్టా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది ప్రభుత్వ భూమిగా నమోదవడంతో గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు మంజూరు చేయించేం దుకు ప్రయత్నించినా ఫలించలేదు. ఇదిలా ఉండగా కొందరు కబ్జాదారులు వీటిపై కన్నేసి ప్రభుత్వ భూమి అయినప్పటికీ కొందరు పేద కార్మికుల నుంచి ప్లాట్లు కొని అక్రమ మార్గాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ప్రస్తుతం ఎకరా సుమారు రూ.2 కోట్ల వరకు పలకడంతో సొసైటీలో కొందరు అక్రమాలకు తెరతీశారు.

948 గజాల స్థలం రిజిస్ట్రేషన్

సొసైటీ ప్రతినిధి ఒకరు, సొసైటీ డైరెక్టర్ పేరిట ఇదే భూమి నుంచి 948 గజాల స్థలాన్ని గతేడాది ఆగస్టులో విక్రయించి రిజిస్ట్రేషన్ పూర్తి చేయడంతో చేనేతలు తాము అన్యాయానికి గురవుతున్నామని గ్రహించారు. పట్టా చేసిన స్థలంలో ఎవరెవరి ప్లాట్లు ఉన్నాయో తెలియక కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కార్మికుల భూమికి దారి లేనందునే పక్క రైతు నుంచి దారి తీసుకొని ఈ స్థలాన్ని అప్పగిస్తున్నామని మాయమాటలు చెబుతూ స్థలాలను కాజేసే యత్నం చేస్తుండడం గమనార్హం. దీంతో కార్మికులు, సంఘం బాధ్యులు న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆశ్రయిస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు

కార్మికులకు పట్టాలిచ్చిన భూమిలో అక్రమాలపై విచారణ జరిపి, అక్రమ నిర్మాణాలు తొలగించాలని, పాత లేఔట్‌ను అనుసరించి ప్లాట్లు గుర్తించాలని చేనేత కార్మికుల తరఫున సామాజిక కార్యకర్త, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర సభ్యుడు కూరపాటి శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ బొంతపల్లి నాగరాజు, కొండ కిరణ్‌లు కలెక్టర్‌కు, జనగామ డీసీపీ, మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు దృష్టిసారించి, నిబంధనల ప్రకారం చేనేతలకు ప్లాట్లు అప్పగిస్తే ఎంతో మందికి న్యాయం జరుగుతుంది.

గతంలోనే ఫిర్యాదు

ఈ స్థలంలో ప్లాట్ల క్రయ, విక్రయాలను నిలువరించాలని 2014లో సొసైటీ బాధ్యులు రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు ఇచ్చారు. 9.14 ఎకరాల భూమిలో సుమారు 30 వేల గజాల స్థలాన్ని ప్లాట్లుగా చేసి, మరో 15 వేల గజాల వరకు అంతర్గత రహదారులకు, ఇతర అవసరాలకు కేటాయించారు. ఇదే అదనుగా సొసైటీకి చెందిన కొందరు కార్మికుల వద్ద నుంచి డబ్బు తీసుకుని అక్రమంగా మరికొందరికి పట్టా సర్టిఫికెట్లు ఇప్పించారు. ఒరిజినల్ పట్టాలున్నా, ఈ భూమివైపు చూడని వారి పట్టా సర్టిఫికెట్లలో వివరాలు మార్చి అమ్ముకున్నట్లు ఆరోపణలున్నాయి. కొందరు సొసైటీ ప్రతినిధుల పేరిట పావులు కదుపుతున్నారు. సొసైటీ సభ్యులు తమకు న్యాయం చేయాలని ప్రశ్నిస్తే 120 గజాల చొప్పున స్థలం రాదని, 80 గజాల చొప్పున వస్తుందని బుకాయిస్తున్నారు.

# నీటిబొట్టు.. ఒడిసిపట్టి

జన్నారం : జన్నారం మండలంలోని కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలోని మూగజీవాలకు తాగునీటి ఇబ్బంది లేకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండుతున్న ఎండలకు మనుషులే తాగునీటికి అల్లాడిపోతున్నారు. అలాంటిది దట్టమైన అడవిలో ఎండిపోయిన చెట్ల మధ్య అగ్ని గుండాన్ని తలపిస్తున్న వేడిలోనూ వన్యప్రాణులకు తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నారు. జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాళ్లపేట రేంజి అధికారిణి సుష్మారావు రోజూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. అనేక చోట్ల ఉన్న కుంటలు, చెరువులను పరిశీలిస్తూనే మరో అయిదు ర్యాంపు వెల్స్ తవ్వించారు. సాసర్ పిట్స్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. కవ్వాల్ పులులు సంరక్షణ కేంద్రం పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న గుట్టల నుంచి సహజ సిద్ధమైన నీటి ఊటలు ఉబికి వస్తున్నాయి. ఆ నీటిని నిల్వ చేయడానికి చెలమలు తవ్వించారు. ఆ నీటిలో రాలిపడే ఎండిపోయిన ఆకులను బేస్ క్యాంపు సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే వన్యప్రాణులు చల్లని నీటిని తాగుతున్నాయి. తాగునీటి కోసం అడవిని వీడాల్సిన పనిలేకుండా పోయింది. తాళ్లపేట రేంజి పరిధిలోని దండేపల్లి, ఊట్ల, నీలాలొద్ది, కోతులగుండం, మహ్మదాబాద్, తుంగమడుగు, తపాల్‌పూర్, చినగుట్ట, ముత్యంపేట, మామిడిలొద్ది, చిగుర్ల ప్రాంతాల్లో సహజసిద్ధమైన నీటి వనరులున్నాయి.

నిండుగా ఉన్న కుంటలు

అడవి మధ్యలో తవ్వించిన కుంటల్లో నీళ్లు ఇప్పటికీ నిండుగానే ఉంటున్నాయి. చెరువులు, కుంటల్లో ఏటా పూడిక తీసి అందులో నీళ్లు నిలిచేలా చేస్తున్నారు. వర్షపు నీరు కుంటల్లోకి చేరుకొని నిండుకుండను తలపిస్తున్నాయి. ఎత్తైన ప్రాంతంలో కురిసే ప్రతి చినుకు బొట్టు కుంటలు, చెరువుల్లోకి ప్రవహించి జలకళను సంతరించుకున్నాయి.

ప్రతి సెక్షన్‌లోనూ చెరువులు, కుంటలు ఉన్నాయి. సోలార్ పిట్స్, సాసర్ వెల్స్, ర్యాంపు వెల్స్ రేంజి పరిధిలో నిండు కుండలను తలపిస్తున్నాయి.

అయిదు ర్యాంపు వెల్స్ తవ్వించాం

సుష్మారావు, రేంజి అధికారిణి, తాళ్లపేట

తాళ్లపేట రేంజి పరిధిలో నీటి ఎద్దడి నివారణకు ఈ ఏడాది అయిదు ర్యాంపువెల్స్ తవ్వించాను. దీంతో ప్రస్తుతం ఇక్కడ 10 ర్యాంపు వెల్స్ ఉన్నాయి. ప్రతి సాసర్ పిట్‌లోనూ ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతు న్నాం. ఏ ఒక్క వన్యప్రాణి దాహంతో అల్లాడి పోయే ప్రసక్తే లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నా. ప్రతి నీటి బొట్టును నిలువ చేసేలా చర్యలు చేపడుతున్నాను.

# ఆదర్శ కళాశాలలు పిలుస్తున్నాయ్..!

కొండమల్లేపల్లి : ఆదర్శ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ప్రభుత్వం ఈ నెల 9న ప్రకటన విడుదల చేసింది. మే 10 నుంచి మే 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రతిభావంతులైన విద్యార్థులు ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో చదవటానికి అవకాశం ఉంది. కళాశాలల్లో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో శిక్షణనిస్తారు. ఉమ్మడి జిల్లాలో 32 కళాశాలలున్నవి.

దరఖాస్తు ఇలా.. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు టీఎస్ ఆన్‌లైన్ లేదా మీ సేవా కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌మోడల్‌స్కూల్స్.కం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి ఉంటుంది. బాలురకు హాస్టల్ వసతి ఉండదు. ప్రతి కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎమ్ఈసీ గ్రూపులుంటాయి. ప్రతి గ్రూప్‌లో 40 సీట్ల చొప్పున మొత్తం 160




మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. వీటిలో 33.33శాతం బాలికలకు రిజర్వేషన్లుంటాయి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పదో తరగతిలో వచ్చిన మార్కులు (జీపీఏ), రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఎస్సీ 15, ఎస్టీ 10, బీసీ 29, ఈడబ్ల్యూఎస్ 10, ఓసీ 36 శాతం చొప్పున సీట్లు కేటాయిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

మల్లేష్‌యాదవ్, ప్రిన్సిపల్, పీఏపల్లి

ఆసక్తి గల విద్యార్థులు ఆదర్శ కళాశాలల్లో చేరి తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునే అవకాశం ఉంది. కళాశాలలో చేరిన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదునిస్తాం. తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# సౌరమే సౌభాగ్యం

ఖమ్మం : ప్రపంచానికి వెలుగునిచ్చే సూర్యుడు మానవాళికి జీవనాధారం.. వెలుగు లేకపోతే మనుగడ లేదు. అలాంటి సూర్యుడికి ఒకరోజు ఉంది. అపరిమితమైన సౌరశక్తిని ఒడిసిపడితే సంప్రదాయ ఇంధన వనరులను తరిగిపోకుండా కాపాడుకోవచ్చు. ఈసారి సరిపడినంత వర్షాలు లేవు. ఇప్పటికే సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జలాశయాల్లో నీరు అడుగంటుతోంది. రాష్ట్రంలో ప్రధానంగా నీటి(హైడల్)తోనే విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. ఇది సరిపోవడం లేదు. బొగ్గు నుంచి ఉత్పత్తి చేసే విద్యుత్తు(థర్మల్)కు సైతం నీరు కావాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భంలో ఎప్పటికీ తరిగిపోని సౌరశక్తితో విద్యుత్తును విరివిగా ఉత్పత్తి చేయాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సౌరశక్తి వినియోగం, లోటుపాట్లు వంటి అంశాలపై ప్రత్యేక కథనం...

కాలుష్య రహితం.. సౌరశక్తిని ప్రోత్సహించేందుకు సూర్య దినోత్సవాన్ని ప్రతిపాదించారు. సౌరవిద్యుదుత్పత్తి సమయంలో పర్యావరణానికి ఎటువంటి హాని చేసే ఉద్గారాలు ఉత్పత్తి కావు. అందుకే దీనిని 'గ్రీన్ ఎనర్జీ' అంటారు. ఉత్పత్తి అత్యంత చవక. ఎక్కడైనా, ఎంత కొద్ది మొత్తంలోనైనా ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. నివాసాలపైనా, ఖాళీ స్థలాల్లో, పంట పొలాల్లో వీటి పలకలను(సోలార్ ప్యానల్స్) ఏర్పాటు చేసుకుని ఇన్వర్టర్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు. బ్యాటరీల్లో నిల్వ చేసుకుని వినియోగించుకోవచ్చు.

సౌర విద్యుత్తు ఉత్పత్తిని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్ రెడ్‌కో) 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన పథకం(పీఎం సూర్యఘర్ స్కీం)' ద్వారా ప్రోత్సహిస్తోంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు నడుస్తున్నాయి. ప్రతి ఇంటికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించడం లక్ష్యం. రూ.78 వేల వరకు రాయితీని అందిస్తున్నారు.

ఈ విద్యుత్తు ఉపయోగించి కోతులు, ఇతర జంతువుల నుంచి ఇళు
్ల, పంట పొలాలకు రక్షణ కల్పించుకోవచ్చు.

ఉత్పత్తి చేసి మనం వినియోగించుకోగా మిగిలింది ప్రభుత్వానికి విక్రయించవచ్చు. పరికరాలు అమర్చినప్పుడే మిగిలి విద్యుత్తు గ్రిడ్‌కు వెళ్లేలా అనుసంధానిస్తారు. ఆరునెలలకోసారి మన బ్యాంకు ఖాతాకు డబ్బు చెల్లిస్తారు.

ఇవిగో సౌర వెలుగులు..

సౌర విద్యుత్తు ఉత్పత్తిలో సమీకృత జిల్లా కలెక్టరు కార్యాలయం ఆదర్శంగా నిలుస్తోంది. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని ఈ కార్యాలయం ప్రాంగణంలో 2023 అక్టోబరు నుంచి సౌర ఫలకాలను ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. 100 కేవీఏ హెచ్‌టీ, 100 కేవీఏ ఎల్‌టీ సౌర ఫలకాలతో నిత్యం సుమారు 900 యూనిట్ల విద్యుత్తు, నెలకు 24 వేల యూనిట్లు ఉత్పత్తి అవుతోంది. వినియోగించుకోగా మిగిలిన విద్యుత్తును ఆన్‌గ్రిడ్‌కు అందజేస్తున్నారు. ప్రతినెలా సుమారు రూ.2 లక్షలకుపైగా విద్యుత్తు బిల్లు ఆదా అవుతోంది.

ఖమ్మం నగరపాలక సంస్థ చైతన్యనగర్ రూ.10 లక్షల ఖర్చుతో పార్కులో 10 కేవీ సౌర విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటు చేసింది.

నగరపాలక సంస్థ కార్యాలయంపై వంద కిలోవాట్లు, ఆవరణలో 30 కేవీ సౌర విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నారు.

ఏమిటీ దినోత్సవం

1978లో అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ దీన్ని ప్రతిపాదించారు. మే 3న అంతర్జాతీయ సూర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. అమెరికాలో ప్రారంభమైన ఈ ఆచారం ప్రస్తుతం ప్రపంచంలోని అన్ని దేశాల్లో పాటిస్తున్నారు.సద్వినియోగం చేసుకుంటే మేలు...

ప్రస్తుతం సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అందించే ఆన్‌గ్రిడ్ సర్వీసులు 620 ఉన్నాయి. ఇందులో గృహ విద్యుత్తు 456, వాణిజ్యం 121, చిన్న పరిశ్రమలు 5, పాఠశాలలు/దేవాలయాలు 38 ఉన్నాయి. ప్రాథమికంగా కొంత ఖర్చుతో కూడుకున్నది కావడంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదు. విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. ప్రతినెలా చెల్లించే విద్యుత్తు బిల్లు మొత్తాన్ని దీర్ఘకాలం లెక్కిస్తే ఇది తక్కువే.

# రసాయన ఎరువులతో చేటు!



యాచారం : అధిక దిగుబడి సాధించేందుకు రైతులు విరివిగా రసాయన ఎరువులు వాడుతున్నారు. పశువుల పేడ, గొర్లు మేకల ఎరువు, వర్మి కంపోస్టు, వానపాముల ఎరువుల తదితర సహజ ఎరువులు వాడకపోవడంతో రోజురోజుకూ భూసారం తగ్గుతోంది. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం నేల సహజ స్వరూపాన్ని మార్చేస్తోంది. రసాయనాల ప్రభావంతో భూమిలోని ముతక లోహాలు క్షీణిస్తున్నాయి. ఇది మున్ముందు ప్రమాదకరం పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలో భూసార పరీక్ష కేంద్రం ఉన్నా ఎక్కువ మంది రైతులు తమ భూమిలో మట్టి పరీక్షలు చేయించడం లేదు. మట్టి పరీక్షలు చేయిస్తే ఏ ఎరువులు ఎంత మేర వాడాలనే లెక్క ఉంటుంది. భూసార పరీక్షలతో కలిగే లాభాల గురించి రైతులకు చెబుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యవసాయ అధికారులు వాపోతున్నారు.

గ్రామ స్థాయిల్లో పరీక్షలు చేస్తే మేలు!

నేడు ప్రతీ మండలంలో నాలుగు రైతు వేదికలు నిర్మించినా అక్కడ భూసార పరీక్షలు చేసే కిట్లను ఉంచడం లేదు. డివిజన్ పరిధిలోనో లేక మరెక్కడో కాకుండా క్లస్టర్ రైతు వేదికల్లో అయినా భూసార పరీక్షల నిర్వహిస్తే గ్రామాల్లోని చాలా మంది తమ పొలాల మట్టిని సేకరించి పరీక్ష చేయించే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ఎక్కడో దూరానికి మట్టిని తీసుకుళ్లడం, మట్టి పరీక్ష ఫలితాల కోసం చాలారోజుల పాటు వేచి చూడడం వంటి పరిస్థితుల వల్లే రైతులు భూసార పరీక్షలకు పెద్దగా ఆసక్తి చూడపం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించక కూడా భూమి సహజత్వాన్ని కోల్పోతోంది. ఏడాదిలో ఒక భూమిలో కనీసం రెండే వేర్వేరు పంటలు పండించాలి. అలా చేస్తేనే అన్ని రకాల సారం పంటలకు అంది దిగుబడి పెరుగుతుంది. అలాగే రసాయన ఎరువుల వాడకం తగ్గే ఆస్కారం ఉంటుంది. వరి సాగుకు ఎకరానికి ఒక బస్తా యూరియా వాడాలి. రైతులు మూడు, నాలుగు బస్తాలు చల్లుతున్నారు. సహజ ఎరువులను ఎంత వాడినా నేల స్వభావం మారదని, కానీ రసాయ ఎరువుల ఎంత ఎక్కువ వాడితే నేల అంత పాడై రానురాను మొక్కల ఎదుగులే లేకుండా పోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

నేలకు సారాన్నిచ్చే చెరువు, కుంటల మట్టి

మెట్ట పంటలకు టిక్కిమట్టితో పాటు పశువులపేడ, మేకల, గొర్రెల ఎరువు, కోడి ఎరువు వాడితే దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. టిక్కి మట్టిలో హ్యూమస్ ఉండి నేల సారవంతంగా మారుతుందన్నారు. ఎలాంటి నేలనైనా పంటలకు అనుగుణంగా మార్చే శక్తి చెర్లు, కుంటల్లోని మట్టికి ఉంటుందన్నారు. చెరువులు ఎండిపోయిన ఇలాంటి సందర్భాల్లో ప్రతీ ఎకరానికి వంద నుంచి 150 టిప్పుల ట్రాక్టర్ల మట్టిని తోలుకోవాలని సూచించారు. ఇలా చేస్తే నేల పైపొర సారవంతగా మారుతుంది. అలాగే పొలంలో తేమ ఎక్కువ రోజులు ఉంటుంది. పొలంలో మట్టి కొట్టుకుంటే పంటలకు యూరియా, పొటాషియం ఎరువుల తక్కువ మోతాదులో వేసుకున్నా దిగుబడి వస్తుంది. టిక్కిమట్టిలో ఉదజని7.4శాతం, నత్రజని 108.33శాతం, భాస్వరం 43.3శాతం, పొటాషియం 227.15 శాతం ఉంటాయని వ్యవసాయాధికారులు తెలిపారు. ఆవు పేడలో 40శాతం న్యూట్రిషన్, 20శాతం పొటాషియం, 10శాతం కాల్షియం ఉంటుందన్నారు. ఇవన్నీ నేలకు సారాన్ని ఇచ్చేవే అన్నారు. పైగా సహజ విధానంలో వాటిని చేకూర్చడం ద్వారా పంట నాణ్యత కూడా బాగుంటుందని చెబుతున్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులను చైతన్యపరచాలి : కె.జోగిరెడ్డి, రైతు, నందివనపర్తి

చాలా మంది రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన లేదు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడి నష్టపోతున్నారు. రైతులు గొర్లు, మేకల, పశువుల ఎరువును వాడితే దిగుబడి పెరగడమే కాక నేలకు సైతం మంచి చేసిన వారం అవుతాం. ప్రతీ సంవత్సరం కచ్చితంగా పంట మార్పిడి విధానాన్ని పాటించాలి. పచ్చి రొట్ట మొక్కలు పెంచి భూమిలో కలియ దున్నాలి. ఇలాంటి విధాలను పాటిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం : జీఎస.సందీపకుమార్, ఏవో, యాచారంమేం తరచూ రైతులను కలిసి రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడాలని చెబుతున్నాం. రసాయన ఎరువులు ఎక్కువ వాడితే మొక్కపచ్చగా వస్తుందేమో గానీ భూసారం నశిస్తుంది. నేల సహజ స్వరూపాన్ని కోల్పోతుందని రైతులకు వివరిస్తున్నాం. పశువుల పేడ, మేకల, గొర్ల ఎరువు, కోళ్ల ఎరువు వాడితే కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్నాం. అయితే ఏళ్లుగా రసాయన ఎరువుల వాడకానికి అలవాటు పడిన రైతులు మా సూచనలు ఎక్కువగా పాఇంచడం లేదు. పంట మార్పిడి విధానాన్ని తప్పక పాటించాలనీ చెబుతున్నాం.

# ఒడిసిపడితేనే జలసిరి



పెద్దపల్లి : పల్లెలు, పట్టణాలు కాంక్రీట్ అరణ్యాలుగా మారి, చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఏటా వందలాది క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతోంది. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా జల సంరక్షణ చర్యలు కరవయ్యాయి. భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి.అతివల చైతన్యం అదుర్స్ నాలుగేళ్ల కిందట ప్రతి నీటి బొట్టునూ నేలలోకి ఇంకించేందుకు ఇంటికొక ఇంకుడుగుంత నిర్మించారు. ఇందుకు స్వశక్తి మహిళల భాగస్వామ్యం తీసుకున్నారు. అతివలు ఇంటింటికీ వెళ్లి ఇంకుడుగుంతల ప్రాముఖ్యాన్ని వివరించడంతో పేదలు ముందుకొచ్చారు. ఉపాధిహామీలో భాగంగా జలశక్తి పథకంలో నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 1,48,87 8 ఇంకుడు గుంతలు నిర్మించారు. తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆశయం అటకెక్కింది.

నిలిచిన బిల్లులు గతంలో ఉపాధిహామీలో నిర్మించిన ఇంకుడుగుంతలకు రూ.4,200 మంజూరు చేయడంతో చాలా మంది పేదలు ముందుకొచ్చారు. అప్పు తెచ్చి నిర్మించుకోగా, బిల్లులు చెల్లింపులో జాప్యంతో ప్రగతిపై ప్రభావం చూపింది. ప్రస్తుతం రూ.6,200కి నిర్మాణ వ్యయం పెరిగింది. సకాలంలో బిల్లులు రాకపోవడంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

ఇంటి నిర్మాణ అనుమతికి తప్పనిసరి

పురపాలికల్లో ఇంటి నిర్మాణ సమయంలో ఇంకుడుగుంత నిర్మిస్తామని విధిగా దరఖాస్తు పత్రంలో పేర్కొంటేనే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలనే నిబంధన ఉంది. ఇంకుడుగుంత నిర్మాణానికి చదరపు గజానికి 10 చొప్పున కనీసం రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటి ఆవరణలో తవ్వుకున్న ఇంకుడుగుంతను పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు ఉంటే రూ.2 వేలు తిరిగివ్వాల్సి ఉంటుంది. అయితే ఈ విషయంలో మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఆశయం నెరవేరడం లేదు.

దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం

ఇళ్ల పైకప్పు నుంచి జాలువారే వాన నీరు, వివిధ అవసరాలకు వాడిన జలాన్ని ఇంకుడుగుంతల ద్వారా నేలలోకి ఇంకించాలి. దీంతో కరవులోనూ బోర్లు ఎండిపోయే అవకాశం ఉండదు. ఉపాధిహామీలో దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం. ఇంకుడు గుంతలపై ప్రజలను చైతన్యం చేస్తున్నాం.

రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పెద్దపల్లి

1985లో హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి తలెత్తడంతో రైల్వే వ్యాగన్ల ద్వారా తరలించి నగరవాసుల దాహార్తి తీర్చారు. 2019లో చెన్నైలో ఏర్పడిన నీటి ఎద్దడి నివారణకు రైల్వే వ్యాగన్ల ద్వారా సరఫరా చేశారు. సింగపూర్ వాసులు ఒకప్పుడు తాగునీటి కోసం మలేషియాపై ఆధారపడేవారు. కుంటలు తవ్వి వర్షపు నీరు అందులోకే వెళ్లేలా చేశారు. అప్పటి నుంచి ఎంతటి కరవు వచ్చినా తాగునీటికి ఇబ్బందులు తలెత్తలేదు. ప్రస్తుతం ఆ దేశంలో భూగర్భ నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి ముప్పు ముంచుకొస్తుండటంతో ఇటీవల హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అప్రమత్తంగా లేకుంటే బెంగళూరు మాదిరిగానే నీటి కష్టాలు తప్పవని హెచ్చరించింది.

ఇలా చేస్తే మేలు ఇళ్లలోని వృథా నీటిని మురుగు కాలువల్లోకి వదలకుండా ఇంకుగుంతలు తవ్వి వాటిలోకి మళ్లించాలి.

సూక్ష్మ, బిందు సేద్యం విధానంతో కూరగాయలు, పండ్ల తోటల పెంపకం చేపట్టాలి.వ్యవసాయ క్షేత్రాల్లో బోరుబావుల పక్కనే ఇంకుడు గుంతల నిర్మాణం కోసం ఉపాధిహామీ నిధులు వినియోగించుకోవాలి. గ్రామాల్లో చేతిపంపులు, మురుగుకాలువల నుంచి వచ్చే నీటిని ఇంకించడానికి సామాజిక ఇంకుడుగుంతలు తవ్వించాలి.

బిందెడు నీటికి బండెడు కష్టాలు

ఉమ్మడి జిల్లాలో నీటి ఎద్దడి రోజురోజుకూ తీవ్రమవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రచారం జగిత్యాలలో 2,53,619 కుటుంబాలు, పెద్దపల్లిలో 2,09,677, కరీంనగర్‌లో 2,58,485, రాజన్నసిరిసిల్లలో 1,38,992 కలిపి మొత్తం 8,60,773 కుటుంబాలున్నాయి. నాలుగేళ్ల కిందట ఉపాధిహామీ పథకంలో నాలుగు జిల్లాల్లో కలిపి కేవలం 1,48,878 ఇంకుడు గుంతలు మాత్రమే నిర్మించారు.

వాటర్ ఫ్లో మీటరుతో అడ్డుకట్ట

పారిశ్రామిక అవసరాలకు పరిమితికి మించి నీటిని వినియోగించకుండా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. ప్రతి బోరు నీటి లెక్కలూ పక్కాగా తేల్చేలా చర్యలు చేపట్టింది. ఇకపై పరిశ్రమల పరిధిలోని బోరుకు 'వాటర్ ఫ్లో మీటరు' బిగించాలన్న ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. కర్మాగారాల ఆవరణంలో నీటి వృథాపై పర్యవేక్షణ కొరవడింది. రెవెన్యూ, పోలీసు, భూగర్భ జల శాఖల అధికారులు తనిఖీల్లో సమన్వయ లోపం కనిపిస్తోంది.

అమలుకు నోచని వాల్టా నిబంధనలు

గృహావసరాల తర్వాత వృథా అయ్యే జలాన్ని మొక్కలకు మళ్లించాల్సి ఉన్నా అమలుకు నోచడం లేదు. ఇళ్లలోని వృథా నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు అసౌకర్యంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. వాల్టా ప్రకారం బోరుబావుల మధ్య 100 మీటర్ల దూరం ఉండాలనే నిబంధనలున్నా వాటిని పక్కనపెట్టి తవ్వేస్తున్నారు. ప్రస్తుతం 400 మీటర్ల లోతు వరకు తవ్వుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, చేతిపంపులు, ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడుగుంతల నిర్మాణంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారు.

# ఆదరణ ఘనం.. సౌకర్యాలు స్వల్పం

సూర్యాపేట: పోటీ పరీక్షలకు లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేటుగా శిక్షణ తీసుకోలేని నిరుద్యోగులకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఆసరాగా నిలుస్తోంది. కొన్నేళ్లుగా వందలాది మంది నిరుద్యోగులకు ఆశ్రయం కల్పిస్తోంది. ఇక్కడ చదువుకున్న వారిలో చాలామంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వివిధ కొలువుల భర్తీకి ప్రభుత్వం ప్రకటనలు విడుదల చేయడంతో చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుంచి నిరుద్యోగులు రోజూ ఈ గ్రంథాలయానికి వచ్చి ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు చదువుకుంటున్నారు. స్థానికంగా కొన్ని సమస్యలు నెలకొన్నాయని పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వేడిగాలి వస్తోంది -సరిత, డీఎస్సీ అభ్యర్థిని, సూర్యాపేట

డీఎస్సీ కోసం గ్రంథాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుకుంటున్నా. మరుగుదొడ్డి ఒక్కటే ఉండటంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. రేకుల కింద చదవటం వల్ల దృష్టి సారించలేకపోతున్నాం. వేడిగాలి వస్తుంది. కనీస వసతులు కల్పించాలి.

గది చాలడం లేదు

-మహేష్, డీఎస్సీ అభ్యర్థి, తిమ్మాపురం

నా భార్య, నేను డీఎస్సీకి సిద్ధపడేందుకు తిమ్మాపురం నుంచి ఇక్కడికి వస్తున్నాం. అరకొర వసతుల కారణంగా ఆమె రావటం లేదు. రోజూ వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. గది చాలడం లేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

సమస్యలు పరిష్కరిస్తాం

-వెంకటరావు, జిల్లా కలెక్టర్, సూర్యాపేట

సంబంధిత అధికారులతో మాట్లాడి, గ్రంథాలయంలో వసతులను పరిశీలిస్తాం. సమస్యలు పరిష్కరిస్తాం. ఉద్యోగ ప్రకటనలు వెలువడటంతో నిరుద్యోగ అభ్యర్థులు ఎక్కువగా గ్రంథాలయాన్ని వినియోగించుకుంటున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

సమస్యలివి.. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రం తొమ్మిది నెలల కిందట మరమ్మతుకు గురైంది. బయట నుంచి శుద్ధజలాలు తెప్పించి పెడుతున్నారు. ఆ నీళ్లు ఎండకు వేడెక్కుతున్నాయి. దీంతో చాలామంది ఇంటి నుంచి నీళ్లసీసాలు తెచ్చుకుంటున్నారు.

గ్రంథాలయానికి రోజూ సుమారు 300 నుంచి 400 మంది వరకు వస్తున్నారు. ఒక టేబుల్‌కి ఆరుగురు చొప్పున కూర్చొని చదువుకుంటున్నారు. బల్లలు సరిపడా లేవు. మహిళలు రేకుల షెడ్డు కింద అభ్యసిస్తున్నారు. పైన రేకుల వేడి, చుట్టూ కర్టెన్లు, పరదాలు లేకపోవడంతో వడగాలులకు అతివలు ఇబ్బంది పడుతున్నారు. ఫ్యాన్ గాలి వేడిగా వస్తోందని, కూలర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కిటికీలకు జాలి లేకపోవడంతో సాయంత్రం దోమల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారు మధ్యాహ్న భోజనానికి ఇబ్బంది పడుతున్నారు. దాతలు స్పందించి భోజన వసతి కల్పించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

రోజూ 100 నుంచి 150 మందికి పైగా మహిళా నిరుద్యోగులు వస్తున్నారు. వారందరూ ఒకే మరుగుదొడ్డి ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం శుభ్రం చేయడం లేదు. దుర్వాసన భరించలేక కొందరు మరుగుదొడ్డి ఉపయోగించడం లేదు. మరో రెండు మరుగుదొడ్లు నిర్మించినా ఇంకా ప్రారంభించలేదు. పురుషుల మరుగుదొడ్డి మరమ్మతులకు గురైంది.


చదువుకునే ప్రదేశంలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. దీంతో పక్కన కూర్చునే అభ్యర్థి అసౌకర్యానికి గురవుతున్నారు. డైనింగ్ హాల్ నిర్మించాలని కోరుతున్నారు.ఇటీవల గ్రంథాలయానికి వచ్చిన ఓ అభ్యర్థి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. సీసీ కెమెరాలు లేకపోవడంతో గుర్తించడం కష్టంగా మారింది. పోలీస్ కేసు నమోదు చేసిన తర్వాత దుండగులు గ్రంథాలయం సమీపంలో డమ్మీ తాళం బైక్‌కి ఉంచి వదిలి వెళ్లారు. పుస్తకాలు కూడా పోతున్నాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

# పేట మార్కెట్‌లో టోకెన్ విధానం

భానుపురి : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన ధాన్యంటుడే: రోజురోజుకూ ధాన్యం రాక పెరుగుతున్న నేపథ్యంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో టోకెన్ విధానాన్ని అమలు చేయనున్నారు. యాసంగి పంట నూర్పిళ్లకు రావటంతో అన్నదాతలు ధాన్యాన్ని అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ఈ వారం రోజుల్లో నూర్పిళ్లు ఊపందుకోవటంతో వడ్ల రాక పెరుగుతోంది. ఒకేసారి ధాన్యం రావటంతో కాంటాల్లో ఆలస్యం, రవాణాలో ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా మార్కెట్ అధికారులు టోకెన్ విధానానికి శ్రీకారం చుట్టారు.

ఇక్కడే ఎక్కువగా కొనుగోళ్లు

సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, తుంగతుర్తిలో వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఈ ఆరింటిలో సూర్యాపేట, తిరుమలగిరి మార్కెట్లలో నిరంతరం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా సూర్యాపేట మార్కెట్ రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద యార్డుగా పేరుంది. ఇక్కడ క్రయవిక్రయా లు నిరంతరం సాగుతాయి. ఆ తర్వాత



తిరుమలగిరి మార్కెట్‌లో కొనుగోళ్లు చేపడతారు. మిగతా మార్కెట్లు క్రయవిక్రయాలు అంతగా జరగవు. దీంతో కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతాల నుంచి రైతులు పంట ఉత్పత్తులను సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొస్తుంటారు. సాధారణ సమయంలో అంతగా రద్దీ ఉండదు. వానాకాలం, యాసంగి సీజన్‌లో యార్డు ఆవరణ ధాన్యంతో నిండిపోతోంది. ప్రస్తుతం యాసంగి సీజన్ కావటంతో ధాన్యం రాక అధిక వస్తున్నందున రైతులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. టోకెన్ పొందిన రైతులు వారికి కేటాయించిన తేదీలో ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయించాలి. ఈ విధానంతో కాంటాలు, రవాణా విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం అంతగా ఉండదు. రైతులు కూడా మార్కెట్‌లో పడికాపులు కాయాల్సిన పరిస్థితి తలెత్తదు.

టోకెన్ ఉంటేనే మార్కెట్‌లోకి అనుమతి

-రాహుల్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

ఈ నెల 10 నుంచి సూర్యాపేట మార్కెట్ యార్డులో టోకెన్ విధానాన్ని ప్రవేశపెడుతున్నాం. టోకెన్ పొందిన రైతుల సరకులకు మాత్రమే మార్కెట్‌లోకి అనుమతి ఉంటుంది. లేకుంటే ప్రవేశం ఉండదు. అన్నదాతలు ఈ విషయాన్ని గమనించి తప్పక టోకెన్ పొందాలి.




## కోర్టుల్లో ఎన్నికల ఫలితాలు తేల్చుకునేవారు.. మాకు హితబోధలా?

కోల్‌కతా: భారత ఎన్నికలపై దుష్ప్రచారం చేస్తున్న పాశ్చాత్య మీడియా తీరును విదేశాంగ మంత్రి జైశంకర్ కడిగిపారేశారు. ఎన్నికల ఫలితాలను తేల్చుకోవడానికి కోర్టుకు వెళ్లేవారు భారత్‌కు హితబోధ చేస్తున్నారంటూ చురకలంటించారు. దాదాపు రెండు శతాబ్దాల పాటు ప్రపంచంపై బలవంతంగా తమ విధానాలను రుద్దిన దేశాలు ఇంకా ఆ మనస్తత్వాన్ని వదులుకోలేకపోతున్నాయని ధ్వజమెత్తారు. "వై భారత్ మ్యాటర్స్" పేరిట ఆయన రాసిన పుస్తకానికి బంగ్లా ఎడిషన్‌ను విడుదల చేస్తూ మంగళవారం కోల్‌కతాలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయా దేశాలను ఒక నిర్దిష్ట వర్గం పాలించాలని పాశ్చాత్య మీడియా ఆశిస్తుంటుందని జైశంకర్ అన్నారు. భారత్‌లో అది జరగకపోయే సరికి అసహనానికి లోనవుతున్నారని ఎండగట్టారు. వారు అనుకున్న విధంగానే భారత్ ఉండాలని ఆశిస్తున్నారన్నారు. లేకపోతే దుష్ప్రచారం మొదలుపెడతారని విరుచుకుపడ్డారు. ప్రతిష్ఠను దిగజార్చేందుకు యత్నిస్తారన్నారు. ఇదంతా ఒక 'మైండ్ గేమ్' అని కొట్టిపారేశారు. మండుటెండల్లో భారత్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్నారంటూ విదేశీ పత్రిక ఒకటి విమర్శలు చేస్తూ ఇటీవల ఓ కథనం ప్రచురించింది. అంతకుముందు భారత్‌లో ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుతంగా సాగుతాయని ఆశిస్తున్నామని మరికొన్ని మీడియా సంస్థలు అనవసరంగా జోక్యం చేసుకున్నాయి. ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలపై ఆంక్షల వంటి అంశాలను ప్రస్తావిస్తూ మరికొన్ని పత్రికలు విమర్శనాత్మక వ్యాసాలను ప్రచురించాయి. ఈ నేపథ్యంలోనే జైశంకర్ తాజాగా వాటికి దీటైన సమాధానమిచ్చారు.

# కమలనాథుల కదనోత్సాహం.. ఓటింగ్ సరళిపై సంతృప్తి

## - సికింద్రాబాద్ , మల్కాజిగిరి, చేవెళ్లలో గెలుపుపై ధీమా




హైదరాబాద్ సిటీ: లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ సరళి తమకు అనుకూలంగా ఉందని, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల నియోజకవర్గాల్లో గెలుపు అవకాశాలు ఉన్నాయని బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మంచి మెజార్టీతో సీట్లు కైవసం చేసుకుంటామని, హైదరాబాద్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈసారి ప్రధాని మోదీ హవా బాగా కనిపించిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులకు ఓటు వేసిన వారు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి వేశారని నాయకులు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో తక్కువ స్థానాలు రావడంతో లోక్‌సభ ఎన్నికలను బీజేపీ నాయకులు సవాల్‌గా తీసుకున్నారు. గ్రేటర్ పరిధిలోని నాలుగు స్థానాల్లో గట్టి అభ్యర్థులను నిలబెట్టారు. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్లలో హేమాహేమీలను బరిలోకి దింపడంతో విజయం ఖాయమనే నిర్ణయానికి వచ్చారు.

**సికింద్రాబాద్‌లో కమలమేనా..!! :** సిట్టింగ్ స్థానమైన సికింద్రాబాద్‌ను మరోసారి కైవసం చేసుకుంటామనే ధీమాతో ఉన్నారు. 1991, 98, 99, 2014, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. కిషన్‌రెడ్డి రెండో సారి మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి గట్టి పోటీ ఉన్నా మోదీ హవా కలిసి వచ్చిందని అంటున్నారు. మరో వైపు బీఆర్ఎస్ ఓటింగ్ కూడా బీజేపీకి పడినట్లు అంచనా వేస్తున్నారు.


**మల్కాజిగిరిలో గెలుపుపై ఆశ :** మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈటల రాజేందర్ గెలుపు తథ్యమని పార్టీ వర్గాలు గట్టి నమ్మకంతో ఉన్నాయి. మొదటి నుంచి మల్కాజిగిరి స్థానంపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. పోలింగ్ సరళి చాలా ప్రాంతాల్లో బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నారు. విద్యాధికులు, కాలనీ ఓటర్లపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. మరో వైపు ఈటల రాజేందర్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేయడం పార్టీకి కలిసి వచ్చినట్లు భావిస్తున్నారు.

**హైదరాబాద్‌లో సత్తా చూపుతుందా..!!** ప్రతి ఎన్నికలో పాతబస్తీలో కమలం సత్తా నిరూపించుకునేందుకు ప్రయత్నం చేసింది. జనసంఘగా ఉన్నప్పటి నుంచి హైదరాబాద్ స్థానం నుంచి పోటీ చేస్తున్నది. ఈసారి ఇక్కడి నుంచి బీజేపీ తరపున మాధవీలత పోటీలో ఉన్నారు. గతంలో కంటే ఎక్కువ ఓట్లు బీజేపీకి వస్తాయని ఆశతో ఉన్నారు.

పది వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని అభ్యర్థి మాధవీ లత ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి పట్టున్న గోషామహల్, కార్వాన్‌లో ఓటింగ్ సరళి తమకు అనుకూలంగా ఉందని పార్టీ అంచనా వేస్తున్నది. చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురాలో కూడా బీజేపీకి ఓట్లు అధికంగానే పడ్డాయని అంచనా వేస్తున్నారు.

గతంలో వచ్చిన ఓట్ల కంటే ఈసారి ఎక్కువగా వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈసారి హైదరాబాద్‌లో పోలింగ్ శాతం ఎక్కువ నమోదు కావడం తమకు లాభిస్తుందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి.

# మండుతున్న పచ్చిమిర్చి ధరలు.. కిలో రూ.120



ఖమ్మం మార్కెట్, మే 14: పచ్చిమిర్చి ధరలు మండు తున్నాయి. వారం క్రితం వరకు కిలో రూ.50-రూ.60 పలికిన ధర ఇటీవల భారీగా పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ.120 వరకు పలుకుతోంది. సూపర్‌మార్కెట్లు, ఆన్‌లైన్ యాప్స్‌లో ఈ ధరలు మరింత అధికంగా ఉన్నాయి. ఖమ్మం రైతు బజారులో మంగళ వారం కిలో రూ.110కు విక్రయించారు. వేసవి ప్రభావంతో పచ్చిమిర్చి సాగు తగ్గడమే ధర పెరుగుదలకు కారణం.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194



## ఆ రోజు ముస్లిం స్నేహితులే అన్నం పెట్టేవారు..

వారణాసి: తన వ్యాఖ్యలు పేదవారి అవస్థల గురించి మాత్రమేనని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. తన వ్యాఖ్యలను ముస్లిం సమాజం గురించి అంటూ వక్రీకరించి జరిపిన దుష్ప్రచారంపై ఆశ్చర్యపోయానన్నారు. చిన్నప్పుడు తమ ఇంట్లో ఈద్ పండగను కూడా నిర్వహించేవారమని 'న్యూస్ 18'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. "నేను ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను. సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్‌ను బలంగా నమ్ముతాను. నా మాటలపై జరిగిన దుష్ప్రచారం చూసి షాక్ అయ్యాను. ఎక్కువమంది పిల్లలు గురించి మాట్లాడినప్పుడు అది ముస్లింల గురించి అని ఎవరు చెప్పారు..? పేద కుటుంబాల్లోనూ ఇదే పరిస్థితి. కొన్ని కుటుంబాల్లో వారి సామాజిక పరిస్థితితో సంబంధం లేకుండా అధిక సంతానం ఉంది. అది ఏ వర్గం అని నేను ప్రస్తావించలేదు. చూసుకోగలిగినంతమంది సంతానాన్నే కనాలి కానీ..వారిని ప్రభుత్వం చూసుకునే పరిస్థితి ఉండకూడదని మాత్రమే చెప్పాను" అంటూ మోదీ స్పష్టత ఇచ్చారు. 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో అల్లర్లు జరిగినప్పుడు మోదీ.. ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. తన ప్రత్యర్థులు ముస్లిం వర్గంలో తన ప్రతిష్ఠను దెబ్బతీశారని దుయ్యబట్టారు. "చిన్నప్పుడు మా ఇంటి చుట్టుపక్కల ఎన్నో ముస్లిం కుటుంబాలు ఉండేవి. మా ఇంట్లో కూడా మిగతా పండగలతో పాటు ఈద్ కూడా నిర్వహించేవాళ్లం. ఈద్ రోజున మా ఇంట్లో వంట చేసుకునేవాళ్లం కాదు. ఆ వర్గానికి చెందిన కుటుంబాలే మాకు ఆహారం తెచ్చిఇచ్చేవి. అలాగే మొహర్రంలోనూ భాగమయ్యేవాళ్లం. అలాంటి ప్రపంచంలో నేను పెరిగాను. నా స్నేహితుల్లో చాలా మంది ముస్లింలు ఉన్నారు" అని వెల్లడించారు. అలాగే ఈ ఎన్నికల్లో ఆ వర్గం నుంచి ఓట్లు పడతాయా? అని ప్రశ్నించగా..ఈ దేశ ప్రజలు తనకు ఓటు వేస్తారని సమాధానం ఇచ్చారు. హిందూ-ముస్లిం అంటూ తేడా చూపడం ప్రారంభించిన రోజు.. ప్రజాజీవితంలో ఉండే అర్హత తనకు ఉండదన్నారు. అలాంటి తేడా ఎన్నటికీ చూపనంటూ ప్రతిజ్ఞ చేశారు. కొద్దిరోజుల క్రితం రాజస్థాన్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ మోదీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. "ప్రజల వద్ద ఉన్న బంగారంతో సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా 'పునఃపంపిణీ' చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చెప్పింది. ఆ మేరకు దేశ సంపదనంతా చొరబాటుదారులకు, ఎక్కువమంది పిల్లలు ఉన్నవారికి పంచుతారు. మీ ఆస్తులను జప్తు చేసే అధికారం ప్రభుత్వాలకు ఉందా? అర్బన్ నక్సలిజం మనస్తత్వం ఉన్న ఆ పార్టీ నాయకులు మహిళల మంగళ సూత్రాలను కూడా వదలరు. మీ కష్టార్జితం చొరబాటుదారుల పాలవడం మీకు సమ్మతమేనా?" అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి.



# ఏపీలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిశాయి. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు జరగ్గా, ఏపీలో పార్లమెంట్‌తో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. చెదురుమొదురు ఘటనలు మినహా మూడోదశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నేతల జాతకాలు ఈవీఎంలలో నిక్షిప్తంగా భద్రపరచడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఎన్నికలతో పోలిస్తే ఏపీ రాజకీయాలు కాస్త భిన్నంగా జరిగాయనే చెప్పాలి.. తెలంగాణలో సీఎం ఎన్నికలు గత ఏడాదే జరగడంతో..అక్కడ పెద్దగా హడావిడి కనిపించలేదు. మీడియా ఫోకస్ అంతా కూడా ఏపీపైనే ఉంచడంతో..ఇక్కడ రాజకీయాలే బాగా హైలేట్ అయ్యాయి. తాజాగా ఏపీలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం గురించి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీలో ఎవరు అధికారంలోకి వచ్చినా వారితో సఖ్యతగా ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తాను అంతా పాజిటివ్ థింకింగ్ మాత్రమే చేస్తానని, నెగిటివ్ థింకింగ్ ఉండదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ భవిష్యత్ తనకు ముఖ్యమని ..పక్క రాష్ట్రాలతో ఎటువంటి వివాదాలు పెట్టుకోమని ఆయన చెప్పుకొచ్చారు. నీటి వివాదాలను కూడా మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకుంటామని.. ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా కొత్త ప్రభుత్వానికి అండగా ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.అలాగే తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# రైతులను విస్మరించి రాజకీయాలపైనే సర్కార్ దృష్టి



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతులను విస్మరించి రాజకీయాలపైనే దృష్టి పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలుపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్ల పై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు.

తరుగు పేరుతో క్వింటాల్‌కు మూడు కేజీలు తీస్తున్నారని.. రైతులకు అన్యాయం చేయొద్దని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే బీఆర్ఎస్ రోడ్డెక్కి ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నాలుగు సార్లు బీఆర్ఎస్ మాత్రమే గెలిచిందని తెలిపారు. కేసీఆర్‌కు బలాన్ని చేకూర్చేలా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

# సీఎం రేవంత్ వైఫల్యాలను అంగీకరించకుండా ప్రతిపక్షాలు, ఉద్యోగులపై అభాండాలా..?



కరెంట్ కోతల విషయంలో సీఎం రేవంత్ తన ప్రభుత్వ వైఫల్యాలను అంగీకరించకుండా ప్రతి పక్షాలు, విద్యుత్ ఉద్యోగుల మీద అభాండాలు మోపడాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. విద్యుత్ రంగ వైఫల్యాలకు నేనే బాధ్యుడిని అన్నట్టుగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వైఖరి ఆడరాక పాత గజ్జెలు అనే సామెతను గుర్తు చేస్తుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, 24 గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు.. విద్యుత్ ఉద్యోగుల సహకారంతో పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించిందని.. రెప్పపాటు కాలం కూడా కరెంట్ కోతలు లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపిందని గుర్తు చేశారు. కేవలం ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను కుప్ప కూల్చిందని.. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు సరిపోయే విద్యుత్ సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తమ చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ప్రతిపక్షాలు, విద్యుత్ ఉద్యోగులపై రేవంత్ రెడ్డి నిరాధార ఆరోపణ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన విద్యుత్ ఉద్యోగులను చీటికి మాటికి నిందించడం, చర్యలు తీసుకోవడం వారి ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయడమేనన్నారు. విద్యుత్ ఉద్యోగులపై నెపం నెట్టడమే తప్ప కరెంటు కోతలను ఎలా సరిదిద్దాలనే చిత్తశుద్ధి సీఎంకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సీఎం ఇలాంటి చిల్లరమల్లర చేష్టలు మాని కేసీఆర్ హయాంలో రెప్ప పాటు కూడా పోని విధంగా 24 గంటల విద్యుత్‌ని ఇచ్చినట్టుగా అన్ని రంగాలకు సరఫరా చేస్తే మంచిదన్నారు. తన లాగే అందరూ కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతారని సీఎం భ్రమల్లో ఉన్నట్టున్నారని.. వాటిని వీడి పాలన పై దృష్టి పెడితే మంచిదంటూ చురకలంటించారు.

# ఏపీలో అల్లర్లపై కఠినంగా వ్యవహరించాలి: కిషన్‌రెడ్డి

ఢిల్లీ: ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని.. ఎన్డీఏ కూటమి గెలుస్తుందని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో అల్లర్లపై కేంద్ర ఎన్నికల కమిషన్, ఏపీ పోలీసులు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఏపీలో కొంత నిరాశ, నిస్పృహ ఉండొచ్చని.. అందుకే అల్లర్లు జరిగి ఉండొచ్చని తెలిపారు. తెలంగాణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పుకొచ్చారు. ప్రజల్లో మార్పు రావడంతో అభ్యర్థులు గొడవకు దిగారని అన్నారు. ప్రజలు ఎవరు రిజర్వేషన్ల అంశాన్ని నమ్మలేదని చెప్పారు. నామినేషన్ ఉపసంహరణ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ మాటలు నమ్మలేదన్నారు. కాంగ్రెస్ గుర్తు మారిపోయిందేమో.. ప్రజలు ఆ పార్టీ గుర్తు గాడిద గుడ్డు అని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. ప్రతి ఇంటికి కరపత్రం వెళ్లిందని.. 100 రోజుల్లో అన్ని అమలు చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఒక్క బస్సు పథకం మాత్రమే నడుస్తుందని.. దానికి ఆర్టీసీకి నిధులు చెల్లించడం లేదని అన్నారు. మహిళలకు రూ.2 వేలు, నిరుద్యోగ భృతి, రైతు కూలీలకు రూ. 12 వేలు, తులం బంగారం అన్నారని.. వాటిని కూడా ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. 420 హామీలు రేవంత్ రెడ్డి ఇచ్చారని.. ఇచ్చిన హామీలపై రేవంత్ దృష్టి పెట్టాలని అన్నారు.ఎన్నికల ముందు రేవంత్ మోదీని విమర్శించారని చెప్పారు. ప్రజలు జూన్ 4న దానికి ఫలితం ఏ రకంగా ఉండబోతుందో చూస్తారని తెలిపారు. కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలనిప్రజల పక్షాన తాము పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. నీచమైన రాజకీయాలు దిగజారాకుండా రేవంత్ రెడ్డి వ్యవహరించాలని చెప్పారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660